

# కరీంనగర్ రైతుబిడ్డ... తెలంగాణ ముద్దుబిడ్డ

తినే తిండిలో విషం లేనిది ఏదైనా ఉందాని వెతుక్కుంటూ పోతే.. రసాయనాలతో కల్తీ కానిదేదీ కనిపించలేదు. మంచి తిండే లేని చోట బిడ్డల్ని పెంచడం ద్రోహమే అనిపించింది అతనికి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొలువుని, విలాసాల నగరాన్ని వదిలి సొంతూరుకు బయలెల్లాడు. వ్యవసాయం మొదలుపెట్టాడు. విఫలమయ్యాడు. నష్టపోయాడు. మళ్లీ మళ్లీ ప్రయత్నించి సఫలమయ్యాడు. నేలను, తిండిని విషతుల్యం చేస్తున్న రసాయన వ్యవసాయానికి ప్రత్యామ్నాయంగా లాభసాటి సేంద్రియ పద్ధతులకు దారి వేశాడు. ఆ చాళ్లలో పెరిగిన పైరు రైతులకు లాభసాటి మార్గమైంది. శాస్త్రవేత్తలకు ఒక పాఠమైంది. ఆ రైతును ఫెలో ఫార్మర్ అవార్డ్ విజేతని చేసింది. ఈ అవార్డుకు ఎంపికైన ఆరుగురిలో దక్షిణ భారత దేశం నుంచి ఎంపికైన ఒకే ఒక్కడు మావురం **మల్లికార్జున్ రెడ్డి**. అతను రైతుబిడ్డే కాదు, తెలంగాణ ముద్దుబిడ్డ కూడా!



మాది వ్యవసాయ కుటుంబం. కరీంనగర్ జిల్లా పెద్దకుర్మపల్లి మా ఊరు. మాకు పదహారు ఎకరాల భూమి ఉంది. మా నాన్న మావురం లక్ష్మారెడ్డి ఆదర్శ రైతు. కొత్త పద్ధతుల్లో పత్తి సాగు చేసి అధిక దిగుబడి తీశారు. సేద్యం కోసం చాలా రకాల పనిముట్లను తయారుచేశారు. పొద్దుతిరుగుడు, మిరప, అరటి సాగులో అనేక ప్రయోగాలు చేశారు. రెండు కిలోల విత్తనాలతో శ్రీవరి సాగు చేసి ఎకరానికి 42 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. నాన్న శ్రమను ప్రభుత్వం గుర్తించింది. కరీంనగర్ కలెక్టర్ ఉత్తమ రైతు అవార్డు ప్రదానం చేశారు. పాలేర్లు, కూలీలు ఉండటం వల్ల చిన్నప్పుడు వ్యవసాయం చేయలేదు. చూశానంతే. వరంగల్లులో బీటెక్ చదివాను.

### దారి చూపమన్నోళ్లే దారి చూపారు

ఉద్యోగం కోసం ఇరవై ఏళ్ల క్రితం హైదరాబాద్ చేరాను. తెలిసినవాళ్లు హాస్పిటల్ పని మీద హైదరాబాద్ వచ్చేవాళ్లు. ఎటు పోవాలో, ఎట్ల పోవాలో అర్థం కాక తోడు రమ్మనేవాళ్లు. చాలామందిని సిటీలోని పెద్ద హాస్పిటల్స్‌కి తీసుకుపోయాను. వచ్చేవాళ్లలో క్యాన్సర్, మరికొన్ని ప్రమాదకరమైన జబ్బులున్నవాళ్లే ఎక్కువ. ఆరుగురు క్యాన్సర్ పేషెంట్లకు వైద్యం చేయించాను. రోగి సమస్యలు, డాక్టర్ సలహాలు వినడం వల్ల క్యాన్సర్ గురించి కొంచెం అవగాహన ఏర్పడింది. రసాయనాలతో కలుషితమైన ఆహారం తినడం వల్ల ఎక్కువమంది క్యాన్సర్ బారిన పడుతున్నారని డాక్టర్లు చెప్పారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కావడం వల్ల నాకు ఇంకా తెలుసుకోవాలనే ఆసక్తితో ఇంటర్నెట్‌లో క్యాన్సర్ మూలాలేమిటో తెలుసుకోవడం మొదలుపెట్టాను. ఓసారి తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీ ఒక నివేదిక ఇచ్చింది. ప్రపంచంలో

### పల్లెకు పోదాం.. సేద్యం చేద్దాం

హైదరాబాద్‌లో పెరుగు జిగటగా ఉండేది. పాల కల్తీని అధికారులు గుర్తించారు. అరె నేను కూడా కల్తీ ఆహారం తింటున్నానే అని బాధపడ్డా. కొన్నాళ్లకు కల్తీ చేసిన వ్యక్తి మళ్లీ పాలు అమ్మడం మొదలుపెట్లాడు. తినేవన్నీ కల్తీ అయినప్పుడు ఇక్కడే ఉంటూ ఇవే తింటూ, ఎందుకు బతకాలి అనుకున్నాను. మా కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని అధ్యయనం మొదలుపెట్టాను. ఆరోగ్యవంతమైన సమాజం చూడాలని వ్యవసాయం చేయాలనుకున్నాను. ఊరికి పోయి, వ్యవసాయం చేయాలనే నిర్ణయానికి వచ్చాను. నా నిర్ణయం మొదట మా ఆవిడకు చెప్పాను. తను ఒప్పుకొన్నాక మా నాన్నకు, మామయ్యకు చెప్పాను. ఇది కష్టమైన పని వద్దన్నారు. నేను బలంగా నిర్ణయించుకున్నాను. కష్టమైనా ఫర్వాలేదు ఓర్చుకుంటానని చెప్పాను. ఈ రకంగా చేస్తే ఇంత ఆదాయం వస్తుందని ఒక ప్రణాళిక ముందే వేసుకున్నానని వాళ్లకు చెప్పి ఒప్పించాను.